క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

పరిష్కారం కాని సమస్యలు..

దుమ్ముగూడెం: ప్రభుత్వాలు మారిన మండలంలోని సమస్యలు పరిష్కారం కావడం లేదని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కొండచరణ్ అన్నారు.శనివారం చెరుపల్లి గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఎన్నికల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండల ప్రజలు రోజురోజుకీ పెరుగుతున్న స్థానిక సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారని, దుమ్ముగూడెం మండల ప్రజలు అంటే ఏలుతున్న ప్రభుత్వాలకు ఎందుకు అంత చిన్న చూపు అని ప్రశ్నించారు. ప్రతీ సమస్య పరిష్కారంపై వచ్చే ఎన్నికల్లో స్థానిక పార్టీలు నాయకులు స్పష్టతనివ్వాలని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దాసరి సాయన్న,నాయకులు మునిగల శివ, శాంత, వీరస్వామి, భద్రయ్య, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు శనివారం లెక్కించారు. ఇటీవలే ఆలయంలో జాతర మహోత్సవాలు జరిగిన నేపథ్యంలో ఆదాయం కొంతమేర పెరిగింది. కాగా అమ్మవారి ఆలయంలోగల హుండీలను తెరిచి లెక్కించగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు రూ.2,02,072ల ఆదాయం సమకురినట్లు ఆ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకుడు పి.బెయిల్ సీంగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సూర్య ప్రకాష్, గ్రామపెద్దలు నరాల శ్రీను, నల్లపు నరసింహారావు, నల్లపు సతీష్, ఆలపాటి నరేంద్ర అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ కళాశాల కోసం మహాధర్నా

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం కేంద్రంగా గిరిజన న్యాయ కళాశాల ఏర్పాటు కోసం జూన్ మొదటి వారంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను నిర్వహిచనున్నట్లు గోండ్వానా సంక్షేమ పరిషత్ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సొందె వీరయ్య తెలిపారు. స్థానిక సుందరయ్యనగర్ కాలనీలోని గోండ్వానా లైబ్రరీ కార్యాలయంలో శనివారం జరిగిన జీఎస్పీ రాష్ట్ర కమిటీ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గిరిజన న్యాయ కళాశాల ఏర్పాటుతో గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం పలు సమస్యల పరిష్కరం కోసం తీర్మానం చేశారు. సమావేశంలో జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, పూనెం సాయి, కనితి వెంటకృష్ణ, పాయం సన్యాసి, పూనెం వరప్రసాద్, రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెంట్లం గ్రామ సమీపంలోని బీరప్ప ఆలయం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బోయనపల్లి సుధాకర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజురవిచంద్ర, ఎమ్మెల్సీ తాతామధు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ గోపినాద్, పర్సా మాదవ్, వీరబోయిన వెంకటేశ్వర్లు, చల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చంద్రుగొండ: మండలంలోని టేకులబంజర్ గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సం నిర్వహించారు. పూజారుల మంత్రోత్సరణల నడుమ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమ్మసోడాకు ఆదరణ అదుర్స్

- ఎండ నుంచి తక్షణ ఉపశమనం
- విక్రయాన్ని ఉపాధిగా మార్చుకుంటున్న యువత
- అధిక సంఖ్యలో దుకాణాల ఏర్పాటు



నిమ్మకాయ సోడా విక్రయించే తోపుడు బండి

సండే స్పెషల్

దుమ్ముగూడెం: సోడా.. ఇది తెలియని వారుండరు. గతంలో గోళి సోడాలు మాత్రమే దొరికేటివి. మారిన కాలానికి అనుగుణంగా గ్యాస్ సోడాలు రావడంతో వేసవిలో ప్రజలకు సేదతీర్చుతున్నాయి. మండలంలో పర్ణశాల, సీతానగరం, బండిరేవు ప్రధాన రహదారిపై తోపుడు బండ్లపై గ్యాస్ సోడాలు విక్రయిస్తూ యువత ఉపాధి పొందుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పర్ణశాలకు వచ్చే భక్తులు ఎండ వేడి నుంచి ఈ నిమ్మసోడాలను తాగి సేదతీరుతారు. పర్ణశాల, సీతానగరం, బండిరేవు, దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు దగ్గర కలిపి సుమారు 20 వరకు ఈ నిమ్మ సోడా దుకాణాలు ఉన్నాయి.

తయారీలో మారిన ట్రెండ్..

రకరకాల సోడాలు మనం చూస్తూనే ఉంటాం. నిమ్మకాయ సోడా, సాల్ట్ సోడా, సుగర్ లెమన్ సోడా, సుగంధి సోడా ఇలా అనేక రకాల సోడాలు మనం తాగే ఉంటాం. అచ్చం అలానే అనేక సంవత్సరాలు గోళీ సోడా ఒక ఊపు ఊపింది. అది తాగితేనే గాని ఉపశమనం పొందే పరిస్థితి ఉండేది కాదు. కడుపు ఉబ్బరంగా.. పట్టేసినట్టు.. అన్నం అరగలేనట్టు.. తేన్పు రాలేనట్టు ఉన్నా ఒక్క గోళీ సోడా తాగితే వీటన్నింటికీ సమాధానం చెప్పేది. ఇప్పుడా గోళీ సోడా ఖాళీ అయ్యింది. రోజుకో రకం సోడా మెషీన్లు అందుబాటులోకి రావడంతో గోళీ సోడాలు కనుమరుగయ్యాయి. కానీ అదే సోడా కొత్తదనంతో పునఃద్దర్శనమిచ్చింది. మారుతున్న వ్యాపారానికి అనుగుణంగా రంగులద్దుకుని మార్కెట్‌లో కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కిల్లీ షాపుల్లో మాత్రమే కనిపించే గోళీ సోడాలు కనుమరుగు కాగా, ఇప్పుడు ప్రత్యేక వాహనాల్లో కొత్త రూపంలో దర్శనమిస్తున్నాయి. రాను రానూ కొత్త రకం యంత్రాలు అందుబాటులోకి రావడంతో సోడాతో పాటు డ్రింక్‌లు సైతం నిమిషాల్లో తయారవుతున్నాయి. ప్రత్యేకంగా తయారు చేసిన బండ్లపై సోడాలు అమ్మడం కనుమరుగై వారి స్థానంలో కొత్త ట్రెండ్‌లో వచ్చిన గోళీ సోడాలు ఆటోలు, ప్రత్యేక వాహనాల ద్వారా విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి మేలు..

చల్లని నిమ్మకాయ సోడా వేసవిలో ఎండ తాపాన్ని తగ్గించి మన శరీరాన్ని చల్లగా చేస్తుంది. అంతేకాక నిమ్మకాయ వలన శరీరానికి సి విటమిన్ పుష్కలంగా లభిస్తుంది. అధిక దప్పికను కూడా ఆపుతుంది. నిమ్మకాయ సోడా తాగడం వల్ల వడదెబ్బ నుంచి కూడా మనం రక్షణ పొందవచ్చు. ఈ నిమ్మకాయ సోడా అనేది పూర్తిగా నాచురల్ గా తయారు చేయబడుతుంది. ఎటువంటి రసాయన కెమికల్స్ పదార్థాలు వాడకుండా చేస్తున్న ఈ నిమ్మకాయ సోడా ఈ వేసవి కాలంలో చాలా ఉపయోగకరం. మరి ముఖ్యంగా ఈ వేసవిలో దొరికే కూల్ డ్రింక్స్ ఇతర కెమికల్స్ పదార్థాలు తాగి ఆరోగ్యం పాడు చేసుకోవడం కంటే మన ఇంటి వద్ద సహజంగా దొరికె నిమ్మకాయ సోడా అనేది మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

ధర పెరిగినా తగ్గని డిమాండ్..

పూర్వం పది పైసల నుంచి ప్రారంభమైన గోళీ సోడాలు రూ.1 వరకూ అమ్మకాలు జరగగా.. ప్రస్తుతం కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన గ్యాస్ సోడా (నిమ్మ) రూ.20కి విక్రయిస్తున్నారు. అయినప్పటికీ పలువురు ఈ సోడాలను తాగుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో ఎక్కువ మంది వీటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కూలింగ్ వాటర్‌తో పెట్టి మరీ అమ్ముతుండడంతో అందరూ వీటిని తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఎండల నుంచి ఉపశమనం..



ఎండల్లో నిమ్మ సోడా తాగడంతో ఎంతో ఉపశమనం కలుగుతుంది. వృత్తి రీత్యా వ్యవసాయదారుడిని కావడంతో ఎక్కువగా ఎండల్లోనే ఉండే అవకాశం ఉంది. అటువంటి సమయంలో ఈ నిమ్మసోడా తాగడంతో మంచిగా ఉంటుంది. ఎండ తాపం నుంచి ఉపశమనం కలిగినట్లు ఉంటుంది.

– మురళీధర్‌రెడ్డి, బండిరేవు

దప్పిక తీరుస్తుంది..



నిమ్మ సోడా తాగడం వల్ల ఎంత దప్పిక ఉన్నా వెంటనే తీరుతుంది. ఎక్కువ ఖర్చు పెట్టి డ్రింకులు తాగే బదులు ఇటువంటి నిమ్మ సోడా తాగడం వల్ల ఉపయోగం ఉంటుంది. ఎండల్లో క్రికెట్ అడుతూ ఉంటాను.. అలసిపోతే వెంటనే నిమ్మ సోడా తాగుతుంటాను.

– అఖిల్, ఆర్.కొత్తగూడెం

రోజుకు రూ.600 అదాయం



నిమ్మసోడాలు విక్రయించడం వల్ల ప్రతి రోజు ఖర్చులు అంతా పోను 600 వరకు అదాయం వస్తుంది. నిమ్మ సోడాలో ఎటువంటి పెస్టిసైడ్స్ లేకపోవడం, కేవలం నిమ్మకాయ నీరు, గ్యాస్‌తో చేయడంతో ప్రజలు కూడా వీటిపై ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు.

– ధనగం వంశీ, నిమ్మసోడా విక్రయదారుడు

ఎమ్మెల్సీ మాటలు హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న యలమంచి వంశీ

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎదుటి పార్టీ వారిని చేర్చుకోగా, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరితే ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించడం గర్హనీయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ విమర్శించారు. పార్టీ మార్పుపై ఎమ్మెల్సీ చేస్తున్న వ్యాఖ్యాలు హాస్యాస్పదమని అభివర్ణించారు. రామలింగేశ్వరావు అధ్యక్షతన జరిగిన కాటాయిగూడం శాఖా సమావేశంలో వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. విద్యావంతుడైన ఒక ఆదివాసి ఎమ్మెల్యే విషయంలో ఈ రకమైన అగ్రకుల దురహంకార వ్యవహార శైలి సమంజసం కాదని అన్నారు. 15 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో అనేక ఆటుపోట్లు తిన్న తెల్లం వెంకట్రావు.. కరోనా సమయంలో విస్తృత సేవలు చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారని అన్నారు. ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మర్మం చంద్రయ్య, కాక కృష్ణ, మర్మం సమ్మక్క, కోర్స నాగరాజు, శ్రీరాములు, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేగా పరామర్శ

అశ్వాపురం: మండలంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శనివారం పర్యటించారు. పలువురి కుటుంబాలను కలుసుకుని పరామర్శించారు. వివరాల్లోకెళితే.. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కందుల కృష్ణార్జున్‌రావు అనారోగ్యంతో బాధపడుతుండగా.. అశ్వాపురంలో కృష్ణార్జున్ నివాసంలో పరామర్శించి ఆరోగ్య వివరాలను రేగా తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీకి చెందిన మాజీ ఎంపీపీ ఇసంపల్లి నరసింహారావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో రేగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్సీ కాలనీకి చెందిన యువజన నాయకుడు జెన్ని రాజశేఖర్ –సుజాత దంపతుల కుమార్తె ఇందు పుష్పాలంకరణ వేడుకలో రేగా పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు ఈదర సత్యనారాయణ, కంచుగట్ల వీరభద్రం, చుంచు రామ్మూర్తి, చిలకా వెంకటరామయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామానికి చెందిన బేతం రాము గత నెల 30న తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్‌లో ద్వారా బాధితుడి ఫోన్‌ను గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ అశోక్‌రెడ్డి ఫోన్‌ను రాముకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మురళికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

దమ్మపేట: మండలంలోని పూసుకుంట, కటుకూరు, కొత్తూరు గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు, స్మైల్ ఆల్వేస్ ఫౌండేషన్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను వితరణగా శనివారం అందజేశారు. మారుమూల గిరిజన ప్రాంతలైన పూసుకుంట, కటుకూరు, కొత్తూరు గ్రామాల్లో నివసించే కొండరెడ్లు, గొత్తికోయలు వేసవిలో సరైన జీవనాధారం, పోషణ లేకుండా ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక నెలకు సరిపడా బియ్యం, గోధుమలు, పప్పులు, నూనె తదితర నిత్యావసరాలను వితరణగా స్మైల్ ఆల్వేస్ ఫౌండేషన్ డైరెక్టర్ కోడి సుదమనుడు గిరిజనులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ డైరెక్టర్ సైలాష్, మడివి ఎలీషా, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



గెలుపొందిన జట్టుతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, తదితరులు

అశ్వాపురం: అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో భారజల కర్మాగారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి వీక్షించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, భారజల కర్మాగారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోగుల కొమరయ్య, పాడ్య కేశవరావు, పెదిరెడ్ల శ్రీనివాస్, డివై.స్వామి, సంక్రాంతి వెంకటేశ్వర్లు, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, చంద్రకళ, ఎంపీటీసీ బేతం రామకృష్ణ, చెంచల రాము, సంపత్, నాయకులు, ఉద్యోగులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో నేడు పవర్ కట్

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): భద్రాచలం పట్టణంలోని కొర్రాజులగుట్ట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భద్రాచలం పట్టణ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని భద్రాచలం విద్యుత్ శాఖ ఏఈ రాజారావు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

చంద్రుగొండలో..

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని 33/11 సబ్‌స్టేషన్ పరిధిలోని చంద్రుగొండ, అయన్నపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఎంఎల్ నర్సింహారావు శనివారం ఒకప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

వడదెబ్బపై అవగాహన

చర్లరూరల్: ఎండలు తీవ్రంగా పెరుగుతున్న తరుణంలో ఎవరూ వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ సూచించారు. మండలంలోని లెనిన్ కాలనీలోని ప్రజలకు వడదెబ్బలపై అవగాహన కల్పించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. పనులను ఉదయం వేళల్లోనే ముగించుకోవాలన్నారు. అనంతరం కొంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వాటిని వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది వేణు గోపాల కృష్ణ, రాంప్రసాద్, ఆశా కార్యకర్త సుశీల పాల్గొన్నారు.

పందిరి ముహూర్తం

చర్ల: మండలంలోని జీపీపల్లి గ్రామాలో ఏర్పాటు చేయనున్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి శనివారం పందిరి ముహూర్తాన్ని నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం దాదాపు పనులన్నీ పూర్తి చేసిన కమిటీ.. ఈ నెల 24న చైత్ర బహుళ పాడ్యమి బుధవారం ఉదయం 10.16 గంటలకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. 22 నుంచి 24 వరకు విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి గ్రామంలో నిర్వహించే పూజాది కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలిరావాలని కమిటీ కోరింది.

దళారులను నియంత్రించాలి

బూర్గంపాడు: ధాన్యం కొనుగోళ్లలో దళారులను నియంత్రించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బీరక సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం ధరలను తగ్గించి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



దమ్మపేట: లింగాలపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు యర్రా వసంతరావు నూతన గృహ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. లింగాలపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదే గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలు ఎమ్మెల్యేకు దృష్టికి రాగా.. సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

అశ్వారావుపేట(ములకలపల్లి): మండలపరిధిలోని పలుగ్రామాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం పర్యటించారు. తొలుత రామచంద్రాపురంలోని సద్గురు ఆశ్రమం అచలపీఠాన్ని దర్శించుకున్నారు. ఇటీవల మరకత లింగాన్ని ప్రతిష్ఠించిన నేపధ్యంలో, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చాపరాలపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన పర్వతనేని రమాదేవి దశదిన ఖర్మలో పాల్గొన్నారు. అంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, పర్వతనేని అమర్‌నాథ్, నల్లమోతు జగదీశ్, గాడి తిరుపతిరెడ్డి, సురభి రాజేశ్, ఉమేశ్, మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, సున్నం సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ మండలంలో..

చంద్రుగొండ: మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం విస్తృతంగా పర్యటించారు. సుంకరబంజర్‌లో ఇటీవల వివాహం అయిన ఎంపీపీ బాణోత్ పార్వతి కుమార్తె నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం అదేగ్రామంలో ఇటీవల మరణించిన బాణోత్ బద్రీ కుటుంబాన్ని పరామర్శించారు. రేపల్లెవాడ గ్రామంలో ఇటీవల వివాహం జరిగిన చిమట నాగేశ్వరరావు కుమార్తె దంపతులను ఆశీర్వదించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిమట రోషయ్యను పరామర్శించారు. టేకులబంజర్ గ్రామంలో ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకున్న గుగులోతు వీర్యను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట నాయకులు ఎంపీపీ పార్వతి, భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, నల్లమోతు రమణ, దారం గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, వసీం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని, దాని మౌలిక స్వరూపాన్ని మార్చాలని తీవ్ర ప్రయత్నం చేస్తోందని, అలాంటి పార్టీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. 'భారత రాజ్యాంగం–ఎదురవుతున్న సవాళ్లు'అనే అంశంపై భద్రాచలం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీజేపీ మంత్రులు, ముఖ్యమంత్రులు సైతం భారత రాజ్యాంగం తమ ప్రామాణిక గ్రంథం కాదని ప్రకటించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రజలందరీ బాధ్యత అని ఆయన అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సులో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిలక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు వై వెంకట రామారావు, లీలావతి పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అంతక ముందు సీపీఎం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కాపుల వెంకటేశ్వర్లు 9వ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ 11వ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను రిటైర్డ్ సీనియర్ నాయకుడు అడప రామగోపాలరావు ఆవిష్కరించి మాట్లాడారు. టీఎస్ యూటీఎఫ్ ఏర్పడి దశాబ్ద కాలంలో ఎన్నో ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను పరిష్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, విజయకుమార్, కరుణకుమార్, శ్రీనివాస్, శ్రీను, వెంకటేశ్వర్లు, రాంబాబు, రమణామూర్తి, భాష్య, మోహన్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి చేయూత

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థి ఉన్నత చదువుల కోసం చేయూత నిచ్చారు. చర్ల మండలం పూసుగుప్ప గ్రామానికి చెందిన విద్యార్థి మడకం సూరిబాబు టెట్, డీఎస్సీ కోచింగ్ కోసం ట్రస్ట్ ద్వారా రూ.44 వేలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పుల మురళి మాట్లాడుతూ.. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సూరిబాబును దత్తత తీసుకుని అతని చదువుకు అవసరమయ్యే ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో సూరిబాబు డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేసి మరింత చదవాలనే తన కోరిక మేరకు కోచింగ్‌కు ట్రస్ట్ ద్వారా దాతల నుంచి సేకరించి రూ.24 వేలు, ఆనంద గోవర్ధన ఫౌండేషన్ శేత, గోవర్ధన్ అందజేసిన రూ.20 వేలు కలిపి విద్యార్థికి అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కోమటిరెడ్డి చైతన్య, జిలకర నాగరాజు, బంధా సాయికుమార్, బూరం నవీన్, గంగాధర సతీష్, వెంకన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తెల్లం బాటలోనే పయనిస్తా..

దుమ్ముగూడెం: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అనుచరుడిగా ఆయన బాటలోనే పయనిస్తానని బీఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కెల్లా శేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పార్టీ సభ్యత్వానికి, తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్ల కాలంగా బీఆర్ఎస్‌లో ఉంటున్నప్పటికీ తనకు సముచిత స్థానం దక్కలేదని, అంతేకాక పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నప్పటికీ ఎప్పుడు తనకు పార్టీ ఉపయోగపడింది లేదని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్న మంత్రులు తుమ్మల, శ్రీనివాస్ రెడ్డిల కృషితోనే ఎమ్మెల్సీగా ఉన్న తాతా మధు.. ఎమ్మెల్యే వెంకట్రావును చాలెంజ్ చేయడం సరైంది కాదని అన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



దుమ్ముగూడెం: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొల్ల వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ మేధస్సును, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

జయంతి వేడుకకు తరలిరండి..

చర్ల: నేడు ఆదివారం నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకలకు దళితులు, బడుగులు, బహుజనులు భారీగా తరలిరావాలని మాలమహానాడు నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చర్లలోని అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేశామని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశాలని అన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు తడికల లాలయ్య, వర్కింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎడెల్ల గణపతి, మంల గౌరవ అధ్యక్షుడు మోతుకూరి ప్రభాకర్, మండల అధ్యక్షుడు రుంజా రాజా తదితరులు ఉన్నారు.